క్లుప్తంగా

రథసప్తమి వేడుకలకు ముస్తాబు

తిరుమల: ఒకరోజు బ్రహ్మోత్సవంగా ప్రసిద్ధి పొందిన రథసప్తమి వేడుకలకు తిరుమల ముస్తాబవుతోంది. ఈనెల 28వ తేదీన 7 వాహన సేవలో విహరించే శ్రీవారిని దర్శించుకునేందుకు అశేష భక్తకోటి తరలిరానుంది. దీనికోసం తిరుమల నాలుగు మాడవీధుల్లో టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం చలువ పందిళ్ల, పెయింట్లు వేయడంతో పాటు టీటీడీ కార్మికులు నాలుగు మాడ వీధులను అందంగా ముస్తాబు చేస్తున్నారు.

మమ్మల్ని ఆదుకోండి

తిరుపతి కల్చరల్: గత 23 ఏళ్లుగా ఫ్లెక్సీలు, బ్యానర్లను తయారు చేస్తూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇప్పుడు వీటిని నిషేధిస్తే తాము, తమ కుటంబాలు రోడ్డున పడుతాయని యాడ్స్ ఫ్లెక్స్ వర్కర్స్ అసోసియేషన్ నేత సుధాకర్‌బాబు తెలిపారు. ఫ్లెక్సీలను కొనసాగించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ వృత్తినే నమ్ముకున్న తమకు జీవన భృతిని కల్పించాలని కోరారు. సమావేశంలో యాడ్స్ ఫ్లెక్స్ వర్కర్స్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తిరుచానూరు: వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వన్నెరెడ్డి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సి.శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం తిరుచానూరులో ఘనంగా నిర్వహించారు. తిరుచానూరు సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శ్రీధర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో తిరుచానూరు పంచాయతీ వార్డు సభ్యులు, బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ యోగానందరెడ్డి, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

తిరుపతి లీగల్ : చోరీ కేసులో ఇద్దరికి 63 రోజుల జైలుశిక్ష, రూ.100 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పల్ల పోలు కోటేశ్వరరావు బుధవారం తీర్పు ఇచ్చారు. గతేడాది తమిళనాడుకు చెందిన షణ్ముగం వెంకటేశన్, నీలాశేఖర్ బస్టాండు సమీపంలో ప్రయాణికుల సెల్ ఫోన్లను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఇద్దరికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

తహసీల్దార్‌కు ప్రశంసాపత్రం



కలెక్టర్ వెంకటరమణారెడ్డి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న తహసీల్దార్ వెంకటరమణ

తిరుపతి అర్బన్: తిరుపతి అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ బుధవారం ఎస్వీ యూనివర్సిటీలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ కే.వెంకటరమణ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. పౌరసేవలతోపాటు ఓటర్ల ప్రక్రియను అంకితభావంతో నిర్వహించిన నేపథ్యంలో ఆయనకు ప్రశంసాపత్రం దక్కింది. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసరావు, ఆర్డీఓలు కనకనరసారెడ్డి, కిరణ్‌కుమార్ ఉన్నారు.

40 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం వంటి నేరాలకు పాల్పడిన 40 మందికి రూ.31,800 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్, ఎస్వీయూ పోలీసులు 40 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ఇద్దరికి రిమాండ్.

తిరుమల లడ్డూ కౌంటర్ నంబర్ 36లో రూ.2,47,250ను అపహరించుకెళ్లిన కేసులో దామినేడుకు చెందిన పి.సీతాపతి, తిరుపతి పెద్దకాపు లేఔట్‌కు చెందిన పి.చందుకు 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు బుధవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. లడ్డూ కౌంటర్ సూపరింటెండెంట్ ఆదినారాయణ ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు.

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి నా క్లయింట్ పి.శివప్రసాద్ తండ్రి లేట్ పి.రామమూర్తి యాదవ్ డి.నెం.4-17, రెడ్డిగుంట, తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి జిల్లా, సెల్ 8466908905 వారి తరఫున తెలియజేయడం ఏమనగా!

నా క్లయింట్ 18.01.2023వ తేదీన రేణిగుంట నుండి తిరుపతికి తన ద్విచక్ర వాహనములో వస్తున్నప్పుడు క్రింద కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తికి సంబంధించి రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ది. 12.03.2014వ తేదీన నా క్లయింట్ పేరున రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్ నెం. 1254/2014 దారిపోయినది. సదరు షెడ్యూలు దాఖలా ఆస్తి పై ఎవ్వరైననూ ఏలాంటి క్రయ, విక్రయ అగ్రిమెంట్లు అడుమాన, తనఖాలు జరిపిన యెడల అవి చట్టరీత్యా ఎంతమాత్రము చెల్లనేరవు. అట్టివారిపై నా క్లయింట్ తీసుకొను సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని హెచ్చరించడమైనది. సదరు డాక్యుమెంట్ ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింట్‌కు గాని లేదా క్రింద తెలిపిన అడ్రసుకు తెలియజేయగలరు.

షెడ్యూలు: చిత్తూరు డి., శ్రీబాలాజి రి.డి., రేణిగుంట సబ్.డి., రేణిగుంట (మం), నెం.8రు, మంగళం గ్రూపుకు చేరిన వెంకటాపురం గ్రామం లెక్కదాఖలా సర్కారు సంజ సర్వే నెం.232/6ఎ రులో ఎ.0-20 సెంట్లుకు హె.0.081 ర్లు గల భూమికి హద్దులు వివరములు: **తూర్పు:** వి.సుబ్బరామయ్య వగైరాల భూమి, **పడమర:** ఎస్.ధనమ్మ భూమి మరియు బండిబాట, **ఉత్తరం:** పి.రామలింగయ్య, వి.సుబ్బరామయ్య భూమి, **దక్షిణం:** ఎస్.ధనమ్మ, పి.పుష్పావతి వగైరాల భూమి. ఈ మధ్య ఎ.0.20 సెంట్లు భూమి.

ఎస్.నరేంద్ర కుమార్, అడ్వకేట్,
డి.నెం.5-1-18, సరోజిని దేవిరోడ్, తిరుపతి.
సెల్: 8374241892

జనం మెచ్చిన సీఎం జగనన్న



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

- డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల కోసం పుట్టిన ప్రభుత్వమని, పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని డిప్యూటి మేయర్ భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి 4వ డివిజన్ పోస్టల్‌కాలనీలో ఆ డివిజన్ అధ్యక్షుడు చింతలచేను గోపి ఆధ్వర్యంలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా అక్కా, అంటూ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా మీకు విద్యా దీవెన వచ్చింది.. వైఎస్సార్ చేయూత పడింది..పెన్షన్ వస్తోంది.. అలాగే రూ.8 లక్షలు విలువ చేసే ఇల్లు కూడా వచ్చింది అంటూ ఆయన ఓ లబ్ధిదారుకు వివరించారు. సీఎం జగన్ వల్లే తమ బతుకుల్లో మార్పు వచ్చిందని పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఆయన మేలును ఎప్పటికీ మరువమని, వచ్చే ఎన్నికల్లో ఓటుతో రుణం తీర్చుకుంటామని పలువురు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆర్.వెంకటేశ్వర్లు, గణేష్, పి.అమరనాథరెడ్డి, నరసింహాచారి, నరేంద్ర, కో–ఆప్షన్ సభ్యులు ఎస్కే ఇమామ్, పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, బాబ్జి, సలామ్, కలీమ్, మార్కెట్ వంశీ, శివాచారి, రాజేంద్ర, ధనశేఖర్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రూ.3.32 కోట్లతో గాంధీపురం అభివృద్ధి



ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న గాంధీపురం నాయకులు, గ్రామస్తులు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలంలోని గాంధీపురం పంచాయతీని రూ.3.32 కోట్ల తుడా నిధులతో, ఎమ్మెల్యే చెవిరెడ్డి సహకారంతో మోడ్రన్‌గా తీర్చిదిద్దుతున్నట్లు ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన గాంధీపురం పంచాయతీలో గడప గడపకు మహా పాదయాత్ర కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. 2024 ఎన్నికల్లో తిరుగులేని మెజారిటీతో వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిరంతరం ప్రజల సంక్షేమానికి పాటు పడే ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

'భవిష్యత్ ఆశాకిరణం మోహిత్' అంటూ ఆంగ్లంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఎంపీపీ ఆవిష్కరించారు. సర్పంచ్ కట్టమంచి లక్ష్మీసెల్వం ప్రత్యేకంగా తయారు చేయించిన 22 కిలోల చాక్లెట్ మాలతో మోహిత్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. అంతకుముందు పంచాయతీ ఉపసర్పంచ్ లక్ష్మీ శివకుమార్ క్రేన్ సాయంతో భారీ గజమాలతో ఎంపీపీకి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సంక్రాంతి కానుక అందించడం పట్ల ప్రజలు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి గడపకు వెళ్లి ఆయన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అవిలాల లోకనాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు దామోదర రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు జయకర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటా



ఎమ్మెల్యే చెవిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జి.లక్ష్మీదేవి

తిరుపతి మంగళం : జీవితాంతం చెవిరెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటానని, ఎమ్మెల్యే గెలుపునకు, పార్టీ అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తానని బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి అన్నారు. మరో రెండేళ్ల పాటు ఆమె పదవిని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆమె బుధవారం తుమ్మలగుంటలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా ఆమె కలిశారు. తమ పదవిని మరో రెండేళ్లు పొడిగింపునకు కృషి చేసిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి కూడా కృతజ్ఞతలు తెలిపారు.

మాస్ సేవలు అభినందనీయం



దుస్తులు కుడుతున్న ఎంపీపీ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మహిళల ఆర్థికాభివృద్ధి కోసం మహర్షి అభ్యుదయ సేవా సంస్థ(మాస్) అందిస్తున్న సేవలు అభినందనీయమని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. తిరుపతి రూరల్ మండలం ఉమ్మడి అవిలాల పంచాయతీలో మాస్ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ సెంటర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన టైలర్‌గా మారి సరదాగా దుస్తులను కుట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా మాస్ సంస్థను మానవీయ సంస్థగా మార్చిన ఘనత సంస్థ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాకుండా రోజూ వారికి భోజనం పెట్టి, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను అందించడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో తుమ్మలగుంటలోనూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోకనాథరెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, సర్పంచ్ లక్ష్మిసెల్వం, ఉపసర్పంచ్ మన్నూరు లక్ష్మి శివ, మాస్ కార్యదర్శి రాజేష్, భానుప్రకాష్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు పటిష్ట బందోబస్తు



రిహార్సల్స్‌లో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి

తిరుపతి క్రైమ్: 74వ గణతంత్ర వేడుకలు గురువారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా జరగనున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి బుధవారం స్వయంగా పర్యవేక్షించి రిహార్సల్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శకటాలు, వివిధ శాఖల స్టాళ్ల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తి ఉట్టి పడేలా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీడీసీఎల్ వారిని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అన్నిశాఖల సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్నిశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నేడు గోకులంలో గణతంత్ర వేడుకలు

తిరుమల: తిరుమలలోని అదనపు ఈఓ కార్యాలయంలోని గోకులం విశ్రాంతి భవనంలో గురువారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరగనున్నాయి. ఉదయం 7 గంటలకు టీటీడీ ఈఓ ధర్మారెడ్డి జెండా ఎగురవేసి సందేశాన్ని ఇస్తారు. అందుకోసం గోకులం ఇప్పటికే ముస్తాబైంది.

భట్రాజులను కించపరిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న భట్రాజుల సంఘం జిల్లా అధ్యక్షుడు

తిరుపతి కల్చరల్: పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు టౌన్‌లో ఇటీవల జరిగిన సంక్రాంతి సంబరాల్లో సినీ గేయ రచయిత చేగుండి అనంత శ్రీరామ్, టాప్ తెలుగు టీవీ చానల్‌లో త్రిపురనేని వరప్రసాద్ భట్రాజుల కులాన్ని కించపరుస్తూ మాట్లాడడం సరికాదని, తమ కులంపై అనవసర వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని భట్రాజుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ రాజు హెచ్చరించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేగొండి అనంత శ్రీరామ్, త్రిపురనేని వరప్రసాద్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సమావేశంలో ఆ సంఘం నేతలు అనంత కుమార్ రాజు, నందకుమార్ రాజు, హరి, సతీష్‌రాజు పాల్గొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీపై శిక్షణ

తిరుచానూరు: సైన్స్ అండ్ టెక్నాలజీలో వారం రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పీఎంయూ కోఆర్డినేటర్ ఆచార్య ఆర్ జి.సాంకావేడ్ పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, శివాజీ యూనివర్సిటీ కొల్హాపూర్, డీఎస్టీ పర్స్ సెంటర్, ఎస్వీ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో వారం రోజుల పాటు ఎస్వీయూలో శిక్షణా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎస్.విజయభాస్కరరావు మాట్లాడుతూ దేశంలోని టాప్ యూనివర్సిటీలకు చెందిన, ఆయా రంగాల్లో సబ్జెక్ట్ నిపుణులచే శిక్షణ ఇప్పిస్తామన్నారు. వివిధ విభాగాల విభాగాధిపతులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది ఓటు



సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న ఆర్డీఓ



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఏఎస్పీ వెంకటరావు

చంద్రగిరి: ప్రజాస్వామ్యానికి పటిష్ట పునాది ఓటు అని ఆర్డీఓ కనకనరసారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత శక్తివంతమైందన్నారు. అంతకుముందు తహసీల్దార్ శిరీష, ఎంపీడీఓ రమేష్ బాబు ఆధ్వర్యంలో విద్యార్థులు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

తిరుపతి క్రైం: జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ఏఎస్పీ వెంకటరావు ఓటర్ల దినోత్సవం ప్రతిజ్ఞని సిబ్బందితో చేయించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 1950 జనవరి 25వ తేదీన భారతీయ ఎన్నికల సంఘం ఏర్పడిందన్నారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరు తమ విలువైన ఓటును ఉపయోగించుకోవాలని ఉద్దేశంతోనే 2011 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం ఈ రోజున జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: ఓటు మన ఆయుధమని జెడ్పీటీసీ ఢిల్లీ భానుకుమార్‌రెడ్డి అన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కమ్మకండ్రిగ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు విలువ తెలుసుకోండి

పాకాల : తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలసి పట్టణ పురవీధుల్లో ర్యాలీ చేపట్టి ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు.

వధూవరులకు పెళ్లి కానుక అందజేత



పాకాల: పెళ్లి కానుకను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల : మండలంలోని కావళివారిపల్లి పంచాయతీ కొత్తూరులో నూతనంగా పెళ్లి చేసుకో బోతున్న రెడ్డెప్ప రమేష్, కోమలావతికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లికానుకను అందజేశారు. బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, పట్టు చీర, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణేష్, యువరాజులనాయుడు, వేణు, దివ్య పాల్గొన్నారు.

ఎర్రావారిపాళెంలో..

ఎర్రావారిపాళెం: బాలాజీ నగర్‌కు చెందిన యశ్వంత్ కుమార్, శిరీషకు పెళ్లికానుకను గ్రామపెద్దల చేతుల మీదుగా స్థానిక నాయకులు అందజేశారు.

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువుపేట గ్రామంలో త్వరలో వివాహం చేసుకోనున్న వరుడు మధుయాదవ్ తల్లిదండ్రులు మాధవి, వెంకటేష్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంఘం ప్రెసిడెంట్ మాదాసు హేమలత బుధవారం పెళ్లికానుక అందించారు. అలాగే అదే గ్రామానికి చెందిన మురళి తల్లిదండ్రులు విజయ, సుబ్బయ్యకు పెళ్లికానుక అందజేశారు.

భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి ఆర్‌కే రోజా

తిరుపతి కల్చరల్: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా పిలుపునిచ్చారు. బుధవారం మహతి కళాక్షేత్రంలో వెరిటాస్ సైనిక్ పాఠశాల తృతీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఆర్‌కే రోజా ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎయిర్‌ఫోర్స్ వైస్ మార్షల్ రిటైర్డ్ అధికారి వీఎస్ఎం దినేష్‌కుమార్ అవస్తి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే దేశరక్షణకు తోడ్పడాలని హితవు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ చైర్మన్ శేషారెడ్డి, డీన్ ఖాన్, డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి వైస్ ప్రిన్సిపల్ రూపరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

లోకేశ్వర్ రెడ్డి కుటుంబానికి పరామర్శ



భారతి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

చంద్రగిరి: మండల పరిధిలోని పిచ్చినాయుడుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లోకేశ్వర్ రెడ్డిని బుధవారం చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పరామర్శించారు. లోకేశ్వర్ రెడ్డి సతీమణి భారతి(45) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. ఈ సందర్భంగా హర్షిత్ రెడ్డి, భారతి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్ రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్మశానవాటిక పరిరక్షణకు సహకరించండి

తిరుపతి అర్బన్: తిరుచానూరు శ్మశానవాటిక పరిరక్షణకు సహకరించాలని స్థానికులు కలెక్టర్ వెంకటరమణారెడ్డికి వివరించారు. బుధవారం వారు కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిశారు. రెండు ఎకరాల స్థలంలో ఉన్న శ్మశానవాటిక అన్యాక్రాంతం అవుతున్న తరుణంలో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసినట్లు చెప్పారు. మరోవైపు అదే ప్రాంతంలోని డంపింగ్ యార్డ్‌ను మరో ప్రాంతానికి తరలించాలని కోరారు. విద్యుత్ శ్మశాన వాటికను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆ మేరకు ఓ వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ తప్పకుండా డంపింగ్ యార్డ్‌ను మరో ప్రాంతానికి తరలిస్తామని, శ్మశాన వాటికి సంరక్షణకు కృషి చేస్తామని వారికి భరోసా కల్పించారు.

కానిస్టేబుల్ నుంచి రక్షణ కల్పించండి



మాట్లాడుతున్న బాధితులు దిలీప్‌కుమార్ రెడ్డి, భారతి

తిరుపతి కల్చరల్: మా ఇంటి విషయంలో కలగజేసుకుని ఇబ్బందులకు గురి చేస్తున్న కానిస్టేబుల్ శంకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని నగరానికి కి చెందిన బాధితులు పి.దిలీప్‌కుమార్‌రెడ్డి, పి.భారతి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కానిస్టేబుల్ ఆగడాలపై ఏడాదిగా న్యాయం కోసం పోరాడుతున్నామన్నారు. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు ఎస్పీని కలిసి అతని ఆగడాల గురించి వివరించామన్నారు. కానీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని వాపోయారు. సోమవారం ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తిని తీసుకొచ్చి మమ్మల్ని బెదిరిస్తూ మా ఇంటి తలుపు ముందు గోడ కట్టించారని తెలిపారు. ఈ సంఘటనపై మళ్లీ ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్తే సివిల్ వివాదమని చెప్పారని తెలిపారు. కానిస్టేబుల్ వల్ల మాకు, మా కుటుంబానికి ప్రాణహాని ఉందని, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సమైక్య స్ఫూర్తికి రాజ్యాంగం తార్కాణం



అవగాహన కల్పిస్తున్న సినీ హీరో మణ్యంకృష్ణ

తిరుపతి ఎడ్యుకేషన్ : సమైక్య స్ఫూర్తికి దేశ రాజ్యాంగం తార్కాణమని, విభిన్నమైన, పటిష్టమైన మన దేశ రాజ్యాంగం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుందని, సమైక్య స్ఫూర్తితో సంఘటిత దేశ భావనతో ఏటా గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నట్లు సినీ హీరో, 100 డ్రీమ్స్ సంస్థ అధ్యక్షుడు మణ్యంకృష్ణ తెలిపారు. స్థానిక గేట్ కళాశాలలో బుధవారం నిర్వహించిన యువ తరంగ్ కార్యక్రమంలో ఆయన యువతకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక హక్కులకు, పౌరుల ప్రాథమిక విధులకు మన రాజ్యాంగంలో ముఖ్యమైన స్థానం ఉందని, సమాజాన్ని మరింత బాధ్యతాయుతంగా, చైతన్యవంతంగా మార్చడానికి తమవంతు బాధ్యతగా స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమాలను రాయలసీమ వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రొఫెసర్ భాస్కర్‌రెడ్డి సేవలు మరువలేనివి

తిరుచానూరు : శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్రం ప్రొఫెసర్‌గా డి.భాస్కర్ రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డి అన్నారు. బెంగళూరులో నిన్న ఆయన మృతి చెందారు. ఈ మేరకు బుధవారం రసాయనశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పద్మావతి ఆధ్వర్యంలో భాస్కర్ రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సంతాపసభలో పాల్గొన్న ఆచార్యులు సీడీ రెడ్డి, శేషయ్య, శ్రీధర్, వెంకటసుబ్బానాయుడు, పద్మజ, సురేష్ రెడ్డి, రామిరెడ్డి, మాధవి, జ్యోతి, మధుసూధన రెడ్డి మాట్లాడుతూ భాస్కర్‌రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.